క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్ర మౌళేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

సరిపల్లిలో 'నామట్టి-నాదేశం'


సరిపల్లిలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

సింహాచలం: పెందుర్తి మండలంలోని సరిపల్లి, సరిపల్లి కాలనీలో సోమవారం నా మట్టి-నాదేశం కార్యక్రమాన్ని బీజేపీ పెందుర్తి నియోజకర్గ అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మట్టి సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కంచిపాటి సన్యాసిరావు, జనరల్ సెక్రటరీ ఎర్ర అచ్చెంనాయుడు, పెందుర్తి రూరల్ మండల అధ్యక్షుడు కాళ్ల జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న యువతి అప్పగింత


కొండమ్మను అమ్మమ్మకు అప్పగిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి వాసు

అల్లిపురం: మే 31న మహారాణిపేట పోలీసులు శ్రీకాకుళం జిల్లా, కోట బొమ్మాళి మండలం, లోకంది గ్రామానికి చెందిన బొత్తరా కొండమ్మ అనే యువతి ఫిట్స్‌తో రోడ్డుపై పడి ఉండటాన్ని గమనించారు. శరీరంపై గాయాలతో బాధపడుతున్న ఆమె సమాచారాన్ని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి తెలియజేశారు. అక్కడ యువతికి తగిన చికిత్స అందజేయడంతో కోలుకుంది. కొండమ్మ నుంచి వివరాలు సేకరించి ఆమె అమ్మమ్మను షెల్టర్‌కు పిలిపించి అప్పగించినట్లు ఏయూటీడీ ప్రతినిధి వాసు తెలిపారు.

కాలుష్య నియంత్రణకు కృషి


తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మనందరి బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ వాహనంలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వారిద్దరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు అందరూ సహకరించాలని, సాధ్యమైనంత వరకు ప్రజా రవాణాను, విద్యుత్ వాహనాలను ఉపయోగించాలని కోరారు.

11న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ మహాజన సభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 11వ సర్వసభ్య సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు స్టీల్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించనున్న సభలో 2022-23 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదిక అందజేత, సంఘం సభ్యత్వాన్ని రూ. 20 నుంచి రూ. 30కు పెంచడం, పదవీ విరమణ ఫండ్ రూ. 5 నుంచి రూ. 10కు పెంచడం తదితర అంశాలను చర్చించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య తెలిపారు. సభ్యులందరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

చేపలు ఎండబెట్టేదెలా?

- వేటసామగ్రి భద్రపర్చుకోవడానికీ ఇబ్బంది
- సామాజిక భవనం దెబ్బతినడంతో అవస్థలు అంటున్న మత్స్యకారులు


శిథిలమైన సామాజిక భవనం మెట్ల మార్గం


మరమ్మతులకు గురైన సామాజిక భవనం ,ప్లాట్‌ఫారం

పరవాడ: మత్స్యకారుల సౌకర్యార్థం ముత్యాలమ్మపాలెం తీరంలో నిర్మించిన సామాజిక భవనం నిరుపయోగగంగా మారింది. 40 ఏళ్ల కిందట తీరంలో నిర్మించిన సామాజిక భవనం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. దీంతో పాటు ఎండు చేపలు ఎండబెట్టుకోవడానికి నిర్మించిన ప్లాట్‌ఫారం కూడా దెబ్బతింది. చేసేది లేక మత్స్యకారులు రోడ్డుపైనే చేపలు ఎండబెడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మత్స్యకారులు వేటకు ఉపయోగించే వలలు, ఇంజిన్లు వంటి వస్తు సామగ్రిని భద్రపర్చుకోవడానికి ఈ భవనం నిర్మించారు. భవనం ముందు భాగంలో నిర్మించిన ప్లాట్‌ఫారంను చేపలు ఎండ బెట్టడానికి ఉపయోగిస్తున్నారు. భవనం ఆలనా పాలనా చూసే వారు లేక గచ్చులు బీటలు వారాయి. ఏమాత్రం వర్షం కురిసిన శ్లాబు కారిపోతుంది. ప్లాట్ ఫారం పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరడంతో వేటాడిన చిరు చేపలను ఎండబెట్టడానికి ప్లాట్ ఫారం లేక రోడ్లను ఆశ్రయించాల్సి వస్తుందని గంగపుత్రులు గగ్గోలు పెడుతున్నారు. భవనానికి ఏర్పాటు చేసిన మెట్ల మార్గం కూలిపోతుంది. మరమ్మతులతో మూల్గుతున్న సామాజిక భవనానికి రిపేర్లు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకొన్నా ఫలితం లేకపోయిందని మత్స్యకార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అనేక విధాలుగా ఉపయోగపడుతున్న సామాజిక భవనానికి మరమ్మతులు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.


రోడ్డుపై ఎండబెట్టిన చేపలు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ధరలు తగ్గించాలని ఐద్వా నాయకుల వినతి

సబ్బవరం: నిత్యావసర వస్తువుల ధరలను, పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ప్రభావతి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ. 400కే గ్యాస్ పంపిణీ చేయాలని, డీజిల్ ధరలను నియంత్రించాలని కోరారు. ఖాళీగా ఉన్న గ్రూప్1, గ్రూప్ 2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాల జీవోను వెంటనే అమలు తమ ప్రధాన డిమాండ్లు అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ సత్యవతి, వై సోంబాబు, సుంకరి కృష్ణ, కంద అప్పారావు తదితరులు ఉన్నారు.

బీజేపీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వరంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో, మహనీయుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో సోమవారం ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, దళిత హక్కుల పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలో వచ్చిన తర్వాత తొమ్మిదేళ్లలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఇప్పుడున్న ఉద్యోగాలు పోవడంతో పాటు భావితరాలకు ఉపాధి ఉండదన్నారు. కార్మికులు, ఉద్యోగులు ఐక్య పోరాటాలతో ప్లాంట్‌ను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.కిరణ్, బి.ప్రకాష్, ఎ.జనార్ధన్, ఎస్.మధురెడ్డి, కె.రమణ, వనజాక్షి, దేవుడమ్మ, జి.జయ, ఎన్.శ్రీను, యు.నాగరాజు, కె.అచ్యుత్‌రావు, ఎంఎ బేగం, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఓటర్ల సర్వే పూర్తి చేయాలి


ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: ఇంటింటి ఓటర్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బీఎల్‌వోలను ఆదేశించారు. జీవీఎంసీ పదో వార్డులో 67, 68 పోలింగ్ కేంద్రాలను జేసీ కె.ఎస్. విశ్వనాథన్‌తో కలసి ఆయన సోమవారం సందర్శించారు. ఆయా కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వేను ఆయన పరిశీలించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. సర్వే జరుపుతున్న బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను పూర్తి సమాచారంతో రిజిస్ట్రేషన్ ద్వారా రికార్డుల్లో నమోదు చేయాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీసీ మోహన్‌రావు, రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య పాల్గొన్నారు.

నైపుణ్యం గల మానవ వనరులతో
ఆక్వారంగం అభివృద్ధి


కోర్సు మెటీరియల్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్ తదితరులు

ఏయూక్యాంపస్: నైపుణ్యం గల మానవ వనరుల వల్ల ఆక్వారంగం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ-అవంతి ఆక్వాకల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో 'రొయ్యల పెంపకంలో మెరుగైన యాజమాన్య విధానాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న రంగాలలో ఆక్వారంగం ఒకటిగా నిలుస్తూ దేశానికి విదేశీ మారకాన్ని ఆర్జిస్తోందన్నారు. అదే సమయంలో ఈ రంగాన్ని అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, నాణ్యతను నిలుపుకోవడం, విత్తనం నుంచి పెంపకం వరకు, ఆహారం వంటివి ఎంతో జాగ్రత్తలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం మాట్లాడుతూ ఈకార్యక్రమంలో ప్రత్యక్ష శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. ఏయూతో అవంతి ఫౌండేషన్‌చేసుకున్న ఎంవోయూలో భాగంగా ప్రపంచ స్థాయి మౌలిక వసతులను కల్పించి, మంచి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఏయూ-అవంతి ఏఎస్‌డీసీ డైరెక్టర్ డాక్టర్ ఏ.కె రెడ్డి మాట్లాడుతూ అవంతి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ ఆలోచనలకు ప్రతిరూపంగా నైపుణ్య శిక్షణ కేంద్రం నిలుస్తుందన్నారు.

ఏయూ-అవంతి ఏఎస్‌డీసీ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె.ఫణి ప్రకాష్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి 16వ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 20 మంది బీఎఫ్ఎస్సీ, ఎంఎస్సీ, బీఎస్సీ విద్యార్హత కలిగిన వారు తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఏపీ నుంచి శిక్షణకు హాజరవుతున్నట్టు చెప్పారు. 13 రోజులు థియరీ, 17 రోజుల పాటు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ రామచంద్ర గణేష్, డాక్టర్ డి.సునీల్ కుమార్, సీహెచ్ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్సు మెటీరియల్‌ను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎ న0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

19వ రోజుకు శ్రీలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం నాటికి 19వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులే పాలకులైన వేళ..

- ఉత్సాహంగా 'యువ మంతన్' జీ 20 మాక్ సదస్సు
- ప్రజా ప్రతినిధులుగా ఆకట్టుకున్న విద్యార్థులు


జీ 20 మాక్ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: మాక్ సదస్సుల ద్వారా విద్యార్థుల్లో విశ్లేషణాత్మక శక్తిని వెలికితీయవచ్చని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో న్యూ ఢిల్లీలో జీ-20 సదస్సు జరగనున్న నేపథ్యంలో పాఠశాలలో సోమవారం యువమంతన్ జీ-20 మాక్ సదస్సును నిర్వహించారు. విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా ఆకట్టుకున్నారు.

'మాక్' సదస్సు సాగిందిలా..

ముందుగా జీ 20 సదస్సుకు హాజరైన అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, సౌత్‌కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, సౌత్ ఆఫ్రికా, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ దేశాల ప్రతినిధులకు ఆతిథ్య దేశమైన భారత్ ప్రధాని గౌరవ సూచకంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం భారతదేశం ఇప్పటివరకు సాధించిన విజయాలను, అధిగమించిన పరిస్థితులను ప్రధాని మోదీ వివరించారు. కోవిడ్-2019ను ఎదుర్కొన్న తీరుతో పాటు వ్యవసాయ రంగం, వైద్య రంగం, పరిశోధనా రంగాల్లో ప్రగతిని వివరించారు. చంద్రయాన్-3 తో ప్రపంచం యావత్తు భారత్ వైపు చూసే విధంగా చేసిన అంతరిక్ష ప్రయోగాలను తెలియజేశారు. అనంతరం ఆయా దేశాల ప్రతినిధులు తాము సాధించిన విజయాలు, ఆయా దేశాల అభివృద్ధిపై ప్రసంగించారు. విద్యార్థులు ఆయా దేశాల ప్రధానులుగా వేష, భాషలతో అలరించారు. కార్యక్రమానికి రూపకల్పన చేసిన ప్రోగ్రాం ఇన్‌చార్జి కుమారస్వామి, ఉపాధ్యాయులు బి.ప్రసాదరావు, బి.శంకరమ్మ, పద్మజ, జి.పద్మ, సుబ్బలక్ష్మి, రవిచంద్ తదితరులను హెచ్‌ఎం కాంతం ప్రత్యేకంగా అభినందించారు.

బాలిక వైద్యానికి రూ.97 వేల ఆర్థిక సాయం


డిస్మిత తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలో భరిణికం గ్రామానికి చెందిన చప్పా శివాజీ దంపతులు కుమార్తె డిస్మిత(4) కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. తల్లిదండ్రులు చిన్న పిల్లల ఆస్పత్రిలో చేర్పించి వైద్య పరీక్షలు చేయించారు. వైద్య పరీక్షల్లో డిస్మితకు బ్లడ్ క్యాన్సర్‌గా నిర్ధారణ కావడంతో తల్లిదండ్రులు కుంగిపోయారు. తమ కుమార్తెను బతికించుకోవాలన్న తపనతో ఫార్మాసిటీలోని హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో చేర్పించారు. చిన్నారి పూర్తి స్థాయిలో కోలుకోవడానికి 8 నెలలు పాటు వైద్యం అందించాలని వైద్యులు సూచించారు. వైద్యం కోసం అవసరమైన ఖర్చులు భరించే ఆర్థిక స్తోమత చిన్నారి తల్లిదండ్రులకు లేదు. ఈ విషయం తెలుసుకున్న భరిణికం గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ముందుకు వచ్చారు. దాతల సాయంతో సమకూర్చిన రూ.97 వేలను సచివాలయంలో డిస్మిత తల్లిదండ్రులకు గ్రామ పెద్దల చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, మాజీ సర్పంచ్ బొండా తాతారావు, గ్రామ పెద్దలు దాట్ల గణేష్‌రాజు, బొండా సతీష్, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఉడుకుల రవికుమార్, సాహిత్య శ్రావ్య, ద్వారపూడి రమేష్ కుమార్, పాచిల ప్రకాష్ పాల్గొన్నారు.

సీపీఎం ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పరవాడ: అధిక ధరలు, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు వి.వి.రమణ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పబ్లిక్ రంగాన్ని కాపాడాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలనే డిమాండ్‌తో సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటి తహసీల్దారుకు సమర్పించారు. అనంతరం రమణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు, సర్‌చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడం, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వంటి చర్యలు దేశానికి ప్రమాదకరమన్నారు. వాటిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు అంతులేకుండా పెరుగుతూనే ఉన్నాయని వాటిని నియంత్రించాల్సి ఉందని రమణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.మాణిక్యం, పీడీ నాయుడు, వి.సన్యాసిరావు, లక్ష్మి, వి.శంకర్రావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పోషకార మాసోత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య తదితరులు

పరవాడ: గర్భిణులు, బాలింతలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం పొందగలుగుతారని నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి అన్నారు. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పిల్లలను అందించే వీలు కలుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం పోషకాహార కిట్లు పంపిణీ చేస్తుందని చెప్పారు. ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఖనిజ లవణాలు, కొవ్వు పదార్థాలు శరీర ఎదుగుదలకు ఉపకరిస్తాయన్నారు. తక్కువ ఖర్చుతోనే బలవర్థకమైన ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కూండ్రపు శ్రీరామ్మూర్తి , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ, హెచ్‌ఎం రమణి, ఎం.ఎస్.కె త్రివేణి,అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కుమారి, కె.కృష్ణవేణి, సీహెచ్.వరహాలమ్మ, ఎం.పార్వతి, ఎస్.కమల, గోవిందమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలి


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డిస్ట్రిక్ట్-101 గవర్నర్ శుభ, జయప్రభాశర్మ తదితరులు

మురళీనగర్: పిల్లల్లో నైతిక విలువలు పెంపొందేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కవయిత్రి, సెయింట్ జోసెఫ్ ఉమెన్స్ కాలేజీ లెక్చరర్ దేవులపల్లి పద్మజ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు విశ్వనాథ జయప్రభాశర్మ అధ్యక్షతన వైశాఖి మహిళా భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ నేటి బాలబాలికలను పెద్దల పట్ల గౌరవ భావాలు ప్రకటించేలా పెంచాలని సూచించారు. ప్రతి ఇంట్లో మాతృభాషలో మాట్లాడాలని, తెలుగు గొప్పదనాన్ని పిల్లలకు చెప్పాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెన్నెల సూర్యనారాయణ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక పరిపక్వతకు ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, రాంపురం బాలికల జూనియర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్(పీజీటీ) కశిరెడ్డి వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులకు దేశ సంస్కృతీ సంప్రదాయాల ప్రాధాన్యాన్ని తెలియజేయాలన్నారు. తెలుగుతోపాటు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా దేవులపల్లి పద్మజ, కశిరెడ్డి వెంకటరావు, వెన్నెల సూర్యానారాయణ మాస్టార్లను వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. అనంతరం క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించి ఈ నెలలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న సభ్యులకు చిరు కానుకలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎస్.రోజారాణి, కోశాధికారి జి.షీలా రాణి, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.